DHARANI NEWS DAILY

# ధరణి న్యూస్

www.dharaninews.com

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 01, సోమవారం 31-08-2026 పేజీలు : 08 వెల : 3/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "ధరణి న్యూస్ " తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9700719535.

## రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నాం

- వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడి



రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను చేపట్టారు. ఈ అభివృద్ధి పనులను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచనలు చేశారు.

**రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకం :** ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు

మిగతా 2లో

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్



2లో

- రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి
- సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా
- అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత
- కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

**అసెంబ్లీ మొదలయ్యేలోపు మార్పులు చేర్పులు!**

- రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు
- మంత్రుల శాఖలను మార్చే పనిలో సీఎం, పీసీసీ వర్గాలు
- సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో కాంగ్రెస్ వర్గాలు



2

రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా? అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యేలోపే మంత్రి మండలి విస్తరణ, ప్రక్షాళనకు సీఎం సిద్ధమవుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గడిచిన నాలుగైదు రోజులుగా రేవంత్ రెడ్డి తన జట్టులో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలు, సామాజిక సమీకరణాలను ఇందుకు ప్రాతిపదికగా తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది. మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకునే విషయంలో కొనసాగుతున్న జాప్యం, సీడబ్ల్యూసీ సమావేశం సమయంలో సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ కావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా సీఎం కసరత్తు చేస్తుండడం లాంటి తాజా రాజకీయ పరిణామాలను చూస్తే మంత్రివర్గ విస్తరణతో పాటు ప్రక్షాళన ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయ్

**'మన్ కీ బాత్'లో మోదీ**

- పీఎం స్వనిధి లబ్ధిదారుల్లో 46 శాతం మంది మహిళలే ఉన్నారన్న ప్రధాని మోదీ
- దేశ యువతులు కలలు భూమిని దాటి స్పేస్‌లోకి దూసుకెళ్తున్నాయని వ్యాఖ్యలు
- మన్ కీ బాత్ ప్రసంగంలో మోదీ వెల్లడి



2లో



2లో

## దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

- జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ
- మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు
- జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష
- సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ
- భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్




2లో

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

## మళ్లీ ఉప్పొంగుతున్న భోటే కోషి- నేపాల్‌లో హైఅలర్ట్- భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక!

- మూడు రోజుల తర్వాత శిథిలాల నుంచి ఆరేళ్ల బాలిక సజీవం
- భారీ వర్షాల హెచ్చరికతో సహాయక చర్యలకు ఆటంకం
- విద్యుత్ ప్రాజెక్టులకు తీవ్ర నష్టం- అమెరికా భారీ సాయం

2




## ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించకపోవడం విచారకరం: జస్టిస్ ఉజ్జల్ భూయాన్



2లో

- సుప్రీంకోర్టులో జడ్జీల నియామకాలపై న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కీలక వ్యాఖ్యలు
- ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సూచన

## అది ఆర్ఎస్ఎస్ ఉపయోగించే పాత ట్రిక్: అసదుద్దీన్ ఒవైసీ



2లో

- మోహన్ భగవత్ వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ ఆడే పాత నాటకమని విమర్శించిన ఒవైసీ
- ఆర్ఎస్ఎస్‌కు రెండు నాల్కల ధోరణి ఉంటుందని ఆరోపణ
- ముస్లింలు, క్రైస్తవులను అంతర్గత శత్రువులుగా చూశారన్న అసద్
- గోల్వాల్కర్, హెడ్గేవార్ రచనల గురించి ప్రస్తావించిన ఎంపీ

## ఉగ్రవాదుల కొత్త వ్యూహం- సీక్రెట్ చాట్ కోసం అశ్లీల యాప్స్ వినియోగం

**రహస్యంగా మాట్లాడేందుకు అశ్లీల వెబ్‌సైట్లు, ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నారని గుర్తించిన భద్రతా సంస్థలు**



ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ఉగ్రవాద సంస్థలు దుర్వినియోగం చేస్తున్న ఉదంతాన్ని ఛేదించిన భద్రతా సంస్థలు, తాజాగా మరో కొత్త వ్యూహాన్ని కనిపెట్టాయి. వీరంతా ఇప్పుడు రహస్యంగా మాట్లాడేందుకు అశ్లీల వెబ్‌సైట్లు, ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నారని గుర్తించారు. సంప్రదాయ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిఘాను తప్పించుకుంటూ జమ్మూ కాశ్మీర్‌లోని ఉగ్రవాదులు, పాకిస్థాన్‌కు చెందిన ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ తమ రిక్రూట్లతో ఈ మార్గాల్లో మాట్లాడుతున్నారని వెల్లడించారు. భద్రతా సంస్థల నిఘా నుంచి తప్పించుకోవడానికి ఈ పోర్నోగ్రఫీ ప్లాట్ ఫారమ్‌లో ఉండే 'రియల్-టైమ్ చాట్'

మిగతా 2లో

# దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయ్ : 'మన్ కీ బాత్'లో మోదీ

దేశ యువతుల కలలు భూమిని దాటి అంతరిక్షంలోకి దూసుకుపోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మిషన్ శక్తిశాట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఆశావహ బాలికలను భారత్ ఏకం చేస్తుండటం గర్వంగా ఉందన్నారు. ఈ చారిత్రక కార్యక్రమం 108 దేశాలకు చెందిన 12,000 మంది విద్యార్థినులకు ఉపగ్రహ సాంకేతికతలో నైపుణ్యం సాధించడానికి, అంతరిక్ష ఆవిష్కరణలలో కొత్త సరిహద్దులను ఆవిష్కరించడానికి అవకాశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం ప్రసారమైన 137వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.("దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర పెరుగుతోంది. పీఎం స్వనిధి స్కీమ్ లక్షలాది మంది మహిళలకు ఊతమిస్తోంది. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్షలాది మహిళలు నగరాలు, పట్టణాల వీధుల్లో తమ పనులతో బిజీగా ఉంటారు. కొందరు కూరగాయలు, కొందరు పండ్లు అమ్ముతారు. కొందరు టీ స్టాల్స్ నిర్వహిస్తారు. మరికొందరు పువ్వులు, దీపాలు, పూజా సామగ్రి అమ్ముతారు. చాలాసార్లు కొద్దిపాటి పెట్టుబడి కొరత వారి వ్యాపారాన్ని ముందుకు సాగకుండా అడ్డుకుంటుంది. కానీ ఇప్పుడు లక్షలాది మంది తల్లులు, సోదరీమణులు పీఎం స్వనిధి పథకం ద్వారా కొత్త బలాన్ని పొందుతున్నారు. చిన్న, వీధి వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తీసుకొచ్చిన 'పీఎం స్వనిధి' పథకం లబ్ధిదారులలో దాదాపు 46 శాతం మంది మహిళలే ఉన్నారు. అంటే దేశవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ పథకం ద్వారా తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. అందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన బబితా శర్మ చక్కని ఉదాహరణ. బబిత గతంలో పూజా సామగ్రిని విక్రయించే ఒక చిన్న స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పీఎం స్వనిధి పథకం ద్వారా ఆమెకు ఆర్థిక సహాయం లభించింది."

**విదేశాల్లోనూ త్రివర్ణపతాకం రెపరెపలాడింది : మోదీ**

దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న దేశభక్తి స్ఫూర్తిని 'మన్ కీ బాత్'లో మోదీ హైలైట్ చేశారు. హర్‌ఘర్ తిరంగా ప్రచారం విజయవంతమవ్వడంతో ఆగస్టు నెల ప్రత్యేకంగా నిలిచిందని తెలిపారు. "జాతీయ చేనేత దినోత్సవం, క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం కారణంగా ఆగస్టు నెల చాలా ప్రత్యేకంగా మారింది. స్వాతంత్ర్య దినోత్సవం, జాతీయ అంతరిక్ష దినోత్సవం వంటి సందర్భాలు ప్రతి పౌరుడిలో గర్వాన్ని నింపాయి. హర్ ఘర్ తిరంగా ప్రచారం ఈ దేశభక్తి భావనను మరింత బలపరిచింది. అదే సమయంలో వందేమాతరం 150వ వార్షికోత్సవం ఈ సంవత్సరాన్ని మరింత విశేషమైనదిగా చేసింది. ఫిజీలోని సువాలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాల్లోని భారత రాయబార కార్యాలయాలు, అమెరికాలో భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది" అని మోదీ స్పష్టం చేశారు.

**డ్రగ్స్ రహిత భారత్ కోసం కృషి చేయాలని ప్రజలకు పిలుపు**

అలాగే భారత్‌ను డ్రగ్స్ రహితంగా మార్చాలని నరేంద్ర మోదీ దేశ పౌరులకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం ముప్పు నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి, యువతకు మంచి భవిష్యత్తును నిర్మించడానికి కలిసి పనిచేయాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల వ్యసనం పర్యావసానాలు కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా మొత్తం కుటుంబం, సమాజంపై పడతాయని చెప్పారు. వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ ప్రచారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఊపందుకుంటోందన్నారు. దేశ యువత ఆరోగ్యం, సంతోషం, ఉజ్వల భవిష్యత్తు కోసం ఇది ప్రజలందరి సమష్టి సంకల్పమని అన్నారు. "ఈ ఏడాది జరిగిన అమర్‌నాథ్ యాత్రలో పరిశుభ్రత, ప్రజా భాగస్వామ్యానికి సంబంధించిన స్ఫూర్తిదాయకమైన ఉదాహరణలను చూశాం. వేలాది మంది పారిశుధ్య కార్మికులు కఠినమైన మార్గాల్లో రేయింబవళ్లు సేవలు అందించారు. 400 మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను సేకరించి, వాటిని శుద్ధి చేశారు. యాత్రికులు ఈ శుభ్రతా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. 16,000 మందికి పైగా పరిశుభ్రత ప్రమాణం చేశారు. పరిశుభ్రత ప్రతి పౌరుడి వ్యక్తిగత నిబద్ధతగా మారినప్పుడు, దాని ప్రభావం పరిసరాలను శుభ్రంగా ఉంచడం వరకే పరిమితం కాదు. అది ఒక ప్రదేశం గుర్తింపు, స్వభావాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. అలాగే ముంబయికి చెందిన కృష్ణ శేషాద్రి WWW.BHARATRAJYA.COM వెబ్‌సైట్‌ను రూపొందించారు. మీరు ఈ వెబ్‌సైట్‌కి వెళ్లి ఏదైనా ఒక సంవత్సరాన్ని ఎంచుకోండి. ఆ సమయంలో భారతదేశంలోని ఏ ప్రాంతాన్ని, ఎవరు పాలించారో ఈ వెబ్‌సైట్‌లో సులభంగా తెలుసుకోవచ్చు. ఇది నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది" అని మోదీ పేర్కొన్నారు.

# మళ్లీ ఉప్పొంగుతున్న భోటే కోషి- నేపాల్‌లో హైఅలర్ట్- భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక!

నేపాల్‌లో ప్రకృతి సృష్టించిన విలయం మరింత విషాదాన్ని నింపుతోంది. వరదలు, కొండచరియలు, శిథిలాల కారణంగా మృతుల సంఖ్య ఆదివారం నాటికి 724కు చేరింది. దాదాపు 2,500 మంది ఇంకా గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉండొచ్చన్న అనుమానంతో సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. అయితే భోటే కోషి నదిలో నీటిమట్టం మళ్లీ పెరుగుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది.

**శిథిలాల నుంచి బాలిక సజీవంగా!**

సహాయక చర్యలు కొనసాగుతున్న వేళ రుసువా జిల్లాలో అద్భుత ఘటన చోటుచేసుకుంది. టిమురే ప్రాంతంలో సాయుధ పోలీసు బలగాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తుండగా, శిథిలాల కింద నుంచి చిన్నారి ఏడుపు వినిపించింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది మట్టి, శిథిలాలను తొలగించి ఆరేళ్ల బాలికను సజీవంగా బయటకు తీశారు. దాదాపు మూడు రోజుల పాటు శిథిలాల కింద చిక్కుకున్నప్పటికీ బాలిక ప్రాణాలతో బయటపడింది. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే మెరుగైన వైద్యం కోసం కాఠ్‌మాండూలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో శిథిలాల కింద చిక్కుకున్న మరికొందరు కూడా సజీవంగా ఉండొచ్చన్న ఆశతో సహాయక సిబ్బంది తనిఖీ చేస్తున్నారు.

**గల్లంతైన వారిలో భారతీయులు**

నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో కలిపి వేలాది మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు తెలిపారు. గల్లంతైన వారిలో విదేశీయులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా మానస సరోవర్ యాత్రకు వెళ్లిన భారతీయుల్లో పలువురి సమాచారం తెలియడం లేదు. భారత విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, 128 మంది భారతీయుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. అయితే గత రెండు రోజుల్లో 598 మంది భారతీయులు చైనా నుంచి నేపాల్‌లోని సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారని వెల్లడించింది. మరో 900 మంది చైనా సరిహద్దుల్లోనే ఉన్నట్లు పేర్కొంది.

**మళ్లీ భోటే కోషిలో వరద ముప్పు**

ఇదిలా ఉండగా, భోటే కోషి నదిలో మరోసారి నీటిమట్టం భారీగా పెరుగుతున్నట్లు నేపాల్ విపత్తు నివారణ సంస్థ ఎన్డీఆర్ఆర్ఎంఏ హెచ్చరించింది. రసువా జిల్లా అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం నుంచి అందిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ హెచ్చరికలు జారీ చేసింది. రసువా, ధాదింగ్, నువాకోట్, చిత్వాన్ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నదీ పరివాహక ప్రాంతాల్లో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరింది. ఇప్పటికే వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో మరోసారి నీటిమట్టం పెరగడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

**భారీ వర్షాలకు హెచ్చరిక**

వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని నేపాల్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో కొన్ని ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా మారింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సహాయక సామగ్రిని తరలించడం, శిథిలాల తొలగింపు, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు నెమ్మదిస్తున్నాయి.

**విద్యుత్ ప్రాజెక్టులకు భారీ నష్టం**

ఈ ప్రకృతి విపత్తు మానవ ప్రాణాలను బలిగొనడంతో పాటు నేపాల్ మౌలిక సదుపాయాలను కూడా తీవ్రంగా దెబ్బతీసింది. ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులతో పాటు సౌర విద్యుత్ కేంద్రాలు వరదలు, శిథిలాల ధాటికి దెబ్బతిన్నాయి. నువాకోట్‌లో త్రిశూలి నది ఒడ్డున ఉన్న సౌర విద్యుత్ కేంద్రం పూర్తిగా శిథిలాల కింద కూరుకుపోయింది. ప్రాజెక్టులోని అనేక పరికరాలు ధ్వంసమయ్యాయి. ఒకప్పుడు అక్కడ సౌర విద్యుత్ కేంద్రం ఉండేదనే విషయాన్ని గుర్తించేలా కొన్ని అవశేషాలు మాత్రమే మిగిలాయి.

**ఇంధన రంగానికీ దెబ్బ**

వరదల కారణంగా ప్రభావిత ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాలకు గణనీయమైన నష్టం వాటిల్లిందని నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే తెలిపారు. త్రిశూలి ప్రాంతంలోని సౌర విద్యుత్ కేంద్రంతో పాటు మరికొన్ని విద్యుత్ ప్రాజెక్టులు కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్లు ధ్రువీకరించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలకు నష్టం వాటిల్లడంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**అమెరికా భారీ మానవతా సాయం**

విపత్తు నేపథ్యంలో నేపాల్‌కు అంతర్జాతీయంగా సహాయం అందుతోంది. నేపాల్‌కు 3.6 మిలియన్ డాలర్లకు పైగా విలువైన ప్రాణరక్షక, మానవతా సహాయాన్ని అందిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది.

ఈ సహాయంలో వరద బాధితులైన సుమారు 10 వేల కుటుంబాలకు అత్యవసర ఆహారం అందించే సామగ్రి కూడా ఉందని తెలిపింది. మరోవైపు భారత్ సహా ఇతర దేశాలు కూడా సహాయక చర్యలకు తమవంతు సహకారం అందిస్తున్నాయి.

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. దాదాపు మంత్రుల అందరి శాఖలను మార్చే పనిలో సీఎం ఉన్నట్లు పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తయిన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించేందుకు కొందరు మంత్రులు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు తెలుస్తోంది.

**రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు**

**అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ :** ప్రస్తుత కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం మంత్రివర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండగా, ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తే మరో రెండు స్థానాలు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. దీంతో మొత్తం మూడు నుంచి నాలుగు బెర్తులు అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త వారికి అవకాశం కల్పించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది.

**ఈ జిల్లాల వారికి ఈసారి అవకాశం :** ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ఈసారి అవకాశం కల్పించే విషయం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రి పదవిపై ఆసక్తి చూపుతుండడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో కేబినెట్‌లోకి తీసుకుని, స్పీకర్ పదవిని మరో నేతకు అప్పగిస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా సీఎం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఏఐసీసీ స్థాయిలో రాజగోపాల్ రెడ్డి పేరు ప్రతిపాదనకు వస్తే సమీకరణాలు మారే అవకాశం ఉందంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఎన్నికలకు వెళతామని సీఎం పదే పదే చెబుతున్నారు. దీంతో ఆయనకు మంత్రి మండలిలో స్థానం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ పేరును పరిశీలించే అవకాశం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది.

**గవర్నర్ కోటాలో 3 స్థానాలు ఖాళీ :** ఈ ఏడాది నవంబర్ గవర్నర్ కోటాలో 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఈరవత్రి అనిల్‌ను ముందుగానే కేబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా సీఎం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది. స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను మంత్రి మండలిలోకి తీసుకునేట్లు అయితే స్పీకర్ కుర్చీ ఖాళీ కానుంది. ఆ స్థానాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌కు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే కేబినెట్ విస్తరణతో పాటు స్పీకర్ మార్పు, మంత్రుల శాఖల మార్పు, ఒకరిద్దరు మంత్రుల తొలగింపు, కొత్త వారికి అవకాశం ఇలా భారీ స్థాయిలో మార్పులు చేర్పులకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఉగ్రవాదుల కొత్త వ్యూహం- సీక్రెట్ చాట్ కోసం అశ్లీల యాప్స్ వినియోగం

టూల్స్‌ను ఉగ్రవాదులు వాడుకుంటున్నారని అధికారులు గుర్తించారు. డేటింగ్ ముసుగులో చుట్టుపక్కల ఉన్న ఒంటరి వ్యక్తులను కనిపెట్టి, ఈ చాట్ రూమ్స్ ద్వారా హ్యాండ్లర్లు తమ అనుచరులకు ఆదేశాలు ఇస్తున్నట్లు తేల్చారు. ఉగ్రవాద కార్యకలాపాలను సమన్వయం చేయడానికి, జమ్మూ కాశ్మీర్‌లోని యువతను ఆకర్షణకు, తీవ్రవాదం వైపు మళ్లించడానికి ఈ పద్ధతిని వాడుతున్నట్లు అధికారులు నిర్ధరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్, సిగ్నల్ వంటి సాధారణ యాప్‌లను వాడకుండా, ఉగ్రవాదులు ప్రత్యేక డిజిటల్ టూల్స్‌పై ఆధారపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్‌క్రిప్టెడ్ నోడ్‌ల ద్వారా డేటాను పంపడానికి, వినియోగదారుల గుర్తింపులను దాచేందుకు కోటెక్స్, కోనియన్ వంటి టోర్-ఆధారిత మెసేజింగ్ అప్లికేషన్‌లపై ఆధారపడుతున్నట్లు తేల్చారు. ఈ డేటా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేర్వేరు సర్వర్ల (నోడ్స్) ద్వారా ప్రయాణించడం వల్ల పంపినవారిని, అందుకున్నవారిని గుర్తించడం చాలా కష్టం. అయితే, భారత్‌లో 'కోనియన్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలు లేదు. ఇలాంటి యాప్‌లపై భారత్‌లో ఇప్పటికే ఆంక్షలు ఉన్నాయి. వీటితో పాటు ఫ్రాన్స్‌కు చెందిన రహస్య యాప్‌లను ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇది సిమ్ కార్డ్ లేదా ఫోన్ నంబర్ అవసరం లేకుండా ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్‌ను అనుమతిస్తుందని వివరించారు. తద్వారా వినియోగదారుని గుర్తించడం కష్టతరం అవుతుందని చెప్పారు. వియత్నాంకు చెందిన యాప్‌లతో పాటు మూన్‌చాట్ వంటి అనామక ప్లాట్‌ఫారమ్‌లను కూడా భద్రతా సంస్థలు పర్యవేక్షిస్తున్నాయి. ఇందులో సంప్రదాయ రిజిస్ట్రేషన్‌ను దాటవేసే, చైనా మూలాలతో ఉన్న PGP-ఎన్‌క్రిప్టెడ్ వెర్షన్‌లు ఉన్నాయి. పోర్న్ అప్లికేషన్‌లో చాలా వరకు భారతదేశంలో నిషేధించినప్పటికీ, వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ ఉపయోగించి వాటిని చట్టవిరుద్ధంగా డౌన్‌లోడ్ చేస్తున్నారు. సహాయంతో ఐపీ అడ్రస్‌లను మార్చి వీటిని అక్రమంగా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వీపీఎన్ వల్ల ఇంటర్నెట్ ప్రోటోకాల్ చిరునామాలను మాస్క్ చేయడం, ఆన్‌లైన్ ట్రాఫిక్‌ను ఎన్‌క్రిప్ట్ చేయడం ద్వారా ఇంటర్నెట్‌లో సురక్షితమైన, ఎన్‌క్రిప్టెడ్ కనెక్షన్‌ను సృష్టిస్తుంది. ఫలితంగా ఆన్‌లైన్ కార్యకలాపాలను ట్రాక్ చేయడం, వారి డేటాను యాక్సెస్ చేయడం మరింత కష్టతరం అవుతుంది. కొన్ని యాప్‌లు ప్రాథమిక ఎన్‌క్రిప్షన్ ఫీచర్లను అందిస్తుండగా, మరికొన్ని ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, సెల్ఫ్-డిస్ట్రక్ట్ మెసేజ్‌లు, RSA-2048 ఎన్‌క్రిప్షన్ అల్గారిథమ్‌ను ఉపయోగిస్తున్నాయి.

## దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ప్రకటించింది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది. పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అప్రైజర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్-టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది. పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

## రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నాం

చేపట్టినట్టు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం క్యాంటీన్, ఎస్కలేటర్, 2 లిఫ్టులు, దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందని వివరించారు. ఈ సంవత్సరం చివరి నాటికి వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునికీకరణ పనులు పూర్తైన తరువాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని స్పష్టం చేశారు.

**ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆగ్రహం :** చేవెళ్లలో హైదరాబాద్ బీజాపూర్ రహదారి రోడ్డు పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రోడ్డు పనుల్లో ఆలస్యం ఎందుకు జరుగుతుందని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు వంకర టింకర్లు ఉండడంతో భూసేకరణ సమయంలో పరిశీలించలేదా అని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు మలుపులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా హెచ్చుగా ఉండటంతో ఒకవైపు సర్వీస్ రావడం, మరోవైపు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు తడబడడంతో హైదరాబాద్ బీజాపూర్ రోజువారి పనుల విషయంలో సమీక్షా సమావేశం నిర్వహించి రైతులు, స్థానికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కాల యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మున్సిపల్ ఛైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు మనీషా అనంత్ రెడ్డి, శైలజా రెడ్డి తదితరులు ఉన్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ప్రముఖ న్యాయకోవిదులను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించకపోవడం విచారకరం: జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రముఖ న్యాయకోవిదులను నియమించాలనే వాదనను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆదివారం బలపరిచారు. ఇలా చేయడం వల్ల ప్రతిభావంతులతో సుప్రీంకోర్టు ధర్మాసనం వైవిధ్యభరితంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే ప్రముఖ న్యాయకోవిదులు న్యాయ నిర్ణయ ప్రక్రియలో పాలుపంచుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (3)(సీ) ప్రకారం ఇటువంటి నియామకానికి వీలున్నప్పటికీ, గత 76 ఏళ్లలో హైకోర్టు న్యాయమూర్తులు లేదా ప్రాక్టీసింగ్ న్యాయవాదులు తప్ప మరెవరూ సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమితులు కాకపోవడం విచారకరమని అన్నారు. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో జస్టిస్ భూయాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది అదే!..** "సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా న్యాయకోవిదుడిని (న్యాయశాస్త్ర నిపుణుడు) నియమించడానికి మన రాజ్యాంగంలో అవకాశం ఉన్నప్పటికీ, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళ్లు దాటినా ఇప్పటివరకు అటువంటి నియామకం జరగలేదు. ఒక విశిష్ట న్యాయకోవిదుడు కోర్టుకు గొప్ప విలువను తీసుకురాగలరు. తన పాండిత్యంతో, అత్యున్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో గణనీయమైన కృషి చేయగలరు. ప్రముఖ న్యాయకోవిదులు, న్యాయ పండితుల భాగస్వామ్యం సుప్రీంకోర్టు పనితీరుపై కీలక ప్రభావాన్ని చూపుతుంది. అత్యున్నత న్యాయస్థానంలో జడ్జీలుగా న్యాయశాస్త్ర నిపుణులు ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. అయితే కేంద్ర ప్రభుత్వం లేదా కొలీజియం ఈ అంశాన్ని ఇప్పటివరకు పరిశీలించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక కావడానికి అవసరమైన లోతైన పరిజ్ఞానం భారతీయ న్యాయకోవిదులకు లేదని వారు భావిస్తున్నారు."

## అది ఆర్ఎస్ఎస్ ఉపయోగించే పాత ట్రిక్: అసదుద్దీన్ ఒవైసీ

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన తాజా వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించేవాడు హిందువే కాదు" అని భగవత్ పేర్కొనడంపై ఒవైసీ స్పందిస్తూ.. ఇది ఆర్ఎస్ఎస్ ఉపయోగించే పాత ట్రిక్ అని, వారి ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనమని దుయ్యబట్టారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ మేరకు తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆర్ఎస్ఎస్‌కు రెండు రకాల మాటలు ఉంటాయని, ప్రపంచానికి ఒకటి, తమ సొంత సభ్యులకు మరొకటి చెబుతారని ఒవైసీ ఆరోపించారు. ముస్లింలు, ఇతర మైనారిటీల పట్ల వారి ప్రధాన సిద్ధాంతకర్తలు, రచయితలు ఏం చెప్పారో ఆర్ఎస్ఎస్ ఎన్నడూ ఖండించలేదని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్, నాడు గాంధీజీ ప్రతిపాదించిన హిందూ-ముస్లిం ఐక్యతను వ్యతిరేకించడం వల్లే కాంగ్రెస్‌ను వీడారని ఒవైసీ పేర్కొన్నారు. అలాగే, మరో సిద్ధాంతకర్త గోల్వాల్కర్.. ముస్లింలు, క్రైస్తవులను దేశానికి 'అంతర్గత ముప్పు'గా అభివర్ణించారని ఆయన తన పోస్టులో ప్రస్తావించారు. గుజరాత్‌లో ముస్లింలపై జరిగిన దాడులను కూడా ఒవైసీ గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ ముసుగు పాలనలోనే ఆ దారుణాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ), క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్న మతమార్పిడి నిరోధక చట్టాలు, యూఏపీఏ వంటి కఠిన చట్టాల దుర్వినియోగం వెనుక ఆర్ఎస్ఎస్ భావజాలమే ఉందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో, సావర్కర్, హెడ్గేవార్, గోల్వాల్కర్ వంటి వారి విషపూరిత రచనలలోని కొన్ని భాగాలను భగవత్ బహిరంగంగా చదివి వినిపించాలని, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ నిజస్వరూపంపై ప్రజలే ఓ నిర్ణయానికి వస్తారని ఒవైసీ సవాల్ విసిరారు.